క్లుప్తంగా

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ ఆదివారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని పలు కాలనీల్లో తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మల్లారెడ్డిపల్లిలో 'కనువిప్పు'



మాట్లాడుతున్న ఎస్సై విజయభాస్కర్

వర్గల్(గజ్వేల్): ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శనివారం రాత్రి మండలంలోని మల్లారెడ్డిపల్లిలో గౌరారం పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. గౌరారం ఎస్సై విజయభాస్కర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆదుకోండి

గజ్వేల్‌రూరల్: ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, 15 రోజులకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న యాదగిరి

నంగునూరు(సిద్దిపేట): నర్మెట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి టీపీసీసీ సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ కరువైందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, ఎంపీటీసీ నితీష్‌కుమార్, నాయకులు యాదగిరి, శ్రీకాంత్, రాజిరెడ్డి, నాగరాజు, కనకయ్య, మల్లేశం, లింగం, కనకయ్య, శ్రీనివాస్, పర్షరాములు, గోపాల్‌రెడ్డి, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకే ప్రజల మద్దతు



మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావుకు పోటీయే లేదని.. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు కేవలం డిపాజిట్ కోసమే పోటీ పడే పరిస్థితి ఉందని బీఆర్ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల ప్రశాంత్, మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యం ప్రజల కష్టసుఖాల్లో తోడుండే నాయకుడు హరీశ్‌రావుకే ప్రజల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జేపీ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

దుబ్బాకరూరల్: అదుపు తప్పి లారీ బోల్తాపడిన సంఘటన మండలంలోని హబ్సిపూర్ రోడ్డులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ హబ్సిపూర్ రోడ్డు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో రోడ్డులో ఎలాంటి ప్రమాదకర సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు.

స్థానికేతరులకు అవకాశం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): స్థానికేతరుడిని తరిమికొట్టి స్థానికుడినైన తనను గెలిపించాలని జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, దొమ్మాట, గుర్జకుంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేర్యాల, కొమురవెల్లి రైతులకు నీరందించేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌తో పొలాలకు సాగునీరు అందించానని తెలిపారు. ఈసందర్భంగా ఆకునూరుకు చెందిన మాజీ సర్పంచ్ కొసల్య మాధవరెడ్డితో పాటు 50 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలం రేబర్తికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి



ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని ఆరపల్లె 8వ వార్డులో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పది సంవత్సరాల కాలంలో హుస్నాబాద్ పట్టణాన్ని రూ.345 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. పార్టీలకతీతంగా అందరిని ఆదరించి సాయం చేసే సతీష్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు సుప్రజ, రాజు, రమేష్, కోఆప్షన్ సభ్యులు లలిత, శంకర్‌రెడ్డి, అయూబ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా బీజేపీ వైపే..

దుబ్బాకటౌన్/దౌల్తాబాద్(దుబ్బాక): దుబ్బాక ప్రజలంతా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు పలువురు బీజేపీలో చేరగా వారికి రఘునందన్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిషన్, ముబారస్‌పూర్ ఉపసర్పంచ్ స్వామి, భూపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ మాజీ ఎంపీటీసీ చుక్క రాజవ్వ నర్సింలుతో పాటు అంబేడ్కర్ సంఘం నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.



బీజేపీలో చేరిన వారితో రఘునందన్‌రావు

నాచగిరిలో భక్తుల సందడి

వర్గల్(గజ్వేల్): జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం ఆదివారం వారాంతపు సెలవురోజు భక్తులతో కిటకిటలాడింది. శనివారం రాత్రి చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం ఉదయం సంప్రోక్షణ, అభిషేకం అనంతరం ఆలయంలోకి భక్తులకు ప్రవేశం కల్పించారు. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు క్షేత్రాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.



క్యూలైన్‌లో భక్తులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక)/మద్దూరు(హుస్నాబాద్): ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం బీఎస్ఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ బలగాల అధికారి శుకరణ్ బిష్ణోయి, మిరుదొడ్డి, దుబ్బాక, అక్బర్‌పేట- భూంపల్లి ఎస్ఐలు నరేష్, గంగరాజు, భువనేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది తిరుమల బాబు, తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో సీఐ సత్యనారాయణ కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

వర్గల్(గజ్వేల్): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆదివారం మండలంలోని వేలూరు, నెంటూరు, నాచారం, మజీద్‌పల్లి గ్రామాల్లో గజ్వేల్ ఏసీపీ రమేష్, తొగుట సీఐ కమలాకర్, గజ్వేల్ రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, గౌరారం, బేగంపేట ఎస్ఐలు విజయ్‌భాస్కర్, అరుణ్, కేంద్ర బలగాల అధికారులు సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.



మిరుదొడ్డిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మహ్మదాపూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ కిరణ్

హుస్నాబాద్‌రూరల్: అక్రమ నగదు, మద్యం రవాణాను కట్టడి చేయడానికి వాహనాల తనిఖీ చేపట్టినట్లు సీఐ కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మహ్మదాపూర్, అక్కన్నపేట మండలంలో కట్కూర్, కోహెడ మండలంలో బస్వాపూర్‌లో సెంట్రల్ బలగాలతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. ఎలాంటి ఆధారాలు చూపని నగదు, మద్యంను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సైలు మహేశ్, వివేక్ ఉన్నారు.

దళితులు ఐక్యంగా ఉండాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: దళితుల అభివృద్ధికి సహకరించిన వారికే ఓటు వేస్తామని దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ బత్తుల చంద్రమౌళి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దళితుల భవిష్యత్ ప్రణాళిక, దళిత సంక్షేమ పథకాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులంతా ఐక్యంగా ఒకేతాటిపై నిలిచి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. త్వరలో మరోసారి సమావేశమై బహిరంగ సభ కోసం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు బోనగిరి రవీందర్, గణేష్, బాలయ్య, ఎల్లయ్య, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

సిద్దిపేటకమాన్: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీలోని శ్రీకాంత్ ఇంట్లో పోలీసులు ఆదివారం తనిఖీ నిర్వహించగా ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యావపూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన స్వామి(49) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా డు. ఈ క్రమంలో ఇంటి వెనకాల శనివారం రాత్రి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

సమష్టిగా పని చేయండి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): బీఆర్ఎస్‌లో అసమ్మతి గళం పెరగకుండా మంత్రి హరీశ్‌రావు బుజ్జగింపుల పర్వం మొదలు పెట్టారు. కొండపాక మండలంలోని అసమ్మతి నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావును కలిశారు. మండలంలోని అన్ని గ్రామాల చెరువులు గోదావరి జలాలతో కాలువల ద్వారా నిండుతున్నాయని.. కేవలం దుద్దెడ, బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా, వెలికట్ట గ్రామాల చెరువులు తపాస్‌పల్లి, మల్లన్నసాగర్‌ల నుంచి కాలువల ద్వారా నింపే ప్రయత్నం చేయాలని మంత్రిని కోరారు. దుద్దెడ నుంచి బందారం, రాజీవ్ రహదారి నుంచి ఆరెపల్లి, వెలికట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో కార్యకర్తలు, నాయకులకు సమాచారం ఇవ్వకుండా కొందరు ఇష్టారాజ్యంగా ఎంపిక చేస్తున్నారని మంత్రికి వివరించారు. ఏళ్లుగా ఖాళీగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించాలని కోరారు. స్పందించిన మంత్రి హరీశ్‌రావు ఎన్నికల సమయం.. సమష్టిగా పనిచేసి సీఎం కేసీఆర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా పనిచేయాలని నచ్చ చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దోమల ఎల్లం, గోనె శ్రీనివాస్, జిర్ర రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

దుబ్బాక/దుబ్బాకరూరల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలంటూ పట్టణంలోని పలు వార్డుల్లో నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, రజిత, కోఆప్షన్ సభ్యుడు స్వామి, నాయకులు వంశీకృష్ణ గౌడ్, భూంరెడ్డి, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని చౌదర్‌పల్లి, ఎనగుర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రవి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, సర్పంచ్‌లు కుమార్, గుండా శంకర్, రాజయ్య, ఎంపీటీసీ చందసాగర్, తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గజ్వేల్: కేసీఆర్ సర్కార్ అరాచకాలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం శామీర్‌పేటలోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నేతలను బీజేపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌లో ప్రస్తుత ఎన్నికలు కీలకమని అభిప్రాయపడ్డారు. తక్కువ సమయంలో ఇంటింటికి వెళ్లి ఓటు అడిగే పరిస్థితి లేనందున కార్యకర్తలు, నాయకులు విస్తృత ప్రచారంతో ముందుకు సాగాలన్నారు. గజ్వేల్‌లో న్యాయం, ధర్మం, ప్రజాస్వామ్యం గెలవాలంటే బీజేపీ విజయపతాకం ఎగరవేయాలన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం తప్ప ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని.. ఈదుస్థితికి అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు టేకులపల్లి రాంరెడ్డి, గాడిపల్లి భాస్కర్, మాదాడి జశ్వంత్‌రెడ్డి, సింగం సత్తయ్య, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగు ముదిరాజ్ తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం శామీర్‌పేటలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు.

'ఈటల'పై తప్పుడు ఆరోపణలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఈటల రాజేందర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని ఆపార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ బండారు మహేష్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ నుంచి గజ్వేల్‌కు వచ్చి ఈటల దళిత బాధితుల సంఘం పేరుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దళితుల ముసుగులో అసత్య ప్రచారాలు చేసేవారిని తరిమి కొడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదన్, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, విజయ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీలో చేరికలు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొట్టాల మల్లేశం ఆదివారం బీజేపీ గజ్వేల్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గజ్వేల్‌లో రాజేందర్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సింగం సత్తయ్య, బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు యాదగిరి, వెంకటేశం, స్వామి, శ్రీకాంత్‌గౌడ్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **'పల్లా' విజయం కోరుతూ పూజలు**

మద్దూరు(హుస్నాబాద్): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించాలని ఆదివారం యాదాద్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు, దూళిమిట్ట మండలాల నుంచి 100 మంది నాయకులు పాల్గొన్నారు.

◆ **దుప్పట్ల పంపిణీ**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

గజ్వేల్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని ఫైలేరియా నివారణ అధికారి కృష్ణమూర్తి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఎస్సీ కాలనీలో ఫ్రీటాస్ మైక్రో ఫైలేరియా సర్వేలో భాగంగా శనివారం రాత్రి ఇంటింటి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చందు, వైద్య సిబ్బంది రమేష్, శ్రీనివాస్, వాసుదేవ్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **అగ్రవర్ణ పార్టీలతో అన్యాయం**

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేట, ఎల్లాపూర్ గ్రామాల్లో ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) అభ్యర్థి వేముల వెంకటప్రసన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టార్చిలైట్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అగ్రవర్ణ పార్టీలతో బడుగు, బలహీన వర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు.



◆ **అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మజార్ మాలిక్, రాషద్, గయాజుద్దీన్, అయుబ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఏకగ్రీవ తీర్మానం**

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ ముదిరాజ్ సంఘం ఓట్లన్నీ గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కే వేస్తామని ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. 10 ఏళ్లుగా బీఆర్ఎస్‌కు ఓట్లు వేస్తే ముదిరాజ్‌లను పట్టించుకోలేదని వాపోయారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ఇద్దరు ఉప సర్పంచ్‌లతో పాటు పలువురు యాదవ సంఘం నాయకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కరీంనగర్ మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ నివాసంలో ఆదివారం బెజ్జంకి, నర్సింహుల పల్లె ఉపసర్పంచ్‌లు బండి వేణు, కుంట హరికృష్ణ, యాదవ సంఘం నాయకులు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బోనాల మల్లేశం, జెల్ల ప్రభాకర్, అయిలయ్య, రాములు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, మానాల రవి, మాంకాలి ప్రవీణ్, డీవీరావు, రాజేందర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



◆ **'గౌరవెల్లి'లోకి చేప పిల్లలు**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులోకి ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో ఆదివారం సుమారు 5 లక్షల చేప పిల్లలను వదిలినట్లు ఆసంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సమ్మయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

◆ **'అభివృద్ధిని విస్మరించారు'**

చేర్యాల(సిద్దిపేట): బీసీ ముదిరాజు బిడ్డగా ప్రజల ముందుకు వస్తున్నా ఆదరించి జనగామ ఎమ్మెల్యేగా గెలిపించాలని టీఆర్ఎస్ జనగామ అభ్యర్థి భీమ లక్ష్మణ్ కోరారు. ఆదివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో జరిగిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. ముత్తిరెడ్డికి రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే చేర్యాల ప్రాంత అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్, సోషల్ మీడియా వారియర్స్ ముస్త్యాల నవీన్, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.